కామెడీ కథ

# జడ

**తెల్లారక ముందే లుంగీ మడిచికట్టి కాలుగాలిన పిల్లిలా స్పీడుగా పచార్లు చేస్తున్నాడు నిన్ననే పెళ్లయిన బాలకోటేశ్వరరావు ఉరఫ్ బామ్మ ముద్దుగా పిల్చుకునే కోటి. గంట నుండీ పచార్లు చేస్తున్నాడే గానీ ఉపాయం తట్టక జుట్టు పీక్కుంటున్నాడు. నిన్న పెళ్లిలో మిగిలిపోయిన జాంగ్రీ ముక్కల్లా పెళ్లయినా వెళ్లిపోని చుట్టాలు మెల్లిగా నిద్దర లేచి ఒకరొకరూ బయటకొస్తున్నారు. చీకట్లో అల్లుడుగారిని చూసి గతుక్కుమన్నాడు మామ అప్పలకొండ.**

"అదేంటల్లుడుగారూ ఇంత పొద్దున్నే ఇక్కడేం చేస్తున్నారూ" అడిగేడు.

"అబ్బే ఏం లేదు. ఉక్కగా ఉంటే బయటకొచ్చానంతే" కంగారుగా అనేసి తప్పించుకుని లోపలికెళ్లిపోయాడు కోటి.

అల్లుడి కంగారుతో మరింత కన్ఫ్యూజయిపోయాడు మామ అప్పలకొండ. పెళ్లయిన మొదటి రాత్రి భార్యనొదిలేసి పచార్లు చేస్తున్నాడంటే అల్లుడికేదన్నా ప్రాబ్లమేమో! పోనీ డాక్టరు దగ్గరికి తీసుకెళ్తేనో. అమ్మో! ఈ పెళ్లికొడుకు బామ్మ పరమ గయ్యాళిది, ఎట్టా చెప్పడం. నీ మనవడు ఇట్టాంటాడంటే నాలుక చీరేస్తుంది. ఇప్పుడెలా? విషయం ఏంటో సరిగ్గా తెలీకపోయినా ఏదేదో ఊహించేసుకుని తనూ జుట్టు పీక్కోడం ప్రారంభించాడు మామగారు.

పెళ్లికొడుకు పడగ్గది నొదిలేసి చేసిన పచార్ల సంగతి ఆ నోటా ఈ నోటా అందరికీ తెలిసిపోయినా కందగడ్డలా మొహం పెట్టుకు కూర్చున్న కొత్తల్లుడినడిగే ధైర్యం ఎవరికీ లేకపోయింది.

ఫ్లాష్‌బ్యాక్‌లో కెళ్తే బాలకోటేశ్వర్రావుకి అమ్మా, నాన్న చిన్నప్పుడే పోవడంతో బామ్మ దగ్గరే పెరిగాడు. బామ్మ గయ్యాళిదయినా మనవడ్ని ముద్దుగానే చూడ్డంతో పెద్దగా చదువబ్బలేదు. ఉన్న పొలాలూ, ఆస్తులతో సర్దుకుపోవచ్చు. ఉన్న ఒక్క మనవడూ ఉద్యోగం పేరుతో ఊళ్లు పట్టుకు తిరగవలసిన అవసరం ఉండదని మరి రెట్టించలేదు సుందరమ్మ. వయసుతో పాటూ గడ్డాలూ, మీసాలూ రావడం మొదలెట్టాయి కోటికి. కానీ సమస్యల్లా గడ్డాలు వచ్చిందానికి రెండింతల స్పీడుతో నెత్తి మీద జుట్టు రాలిపోవడం మొదలెట్టింది. కరవు జిల్లాలో నీళ్లు లేక ఎండిపోయిన పంటలా అయిపోయింది కోటి మిగిలిన జుట్టు.

కంగారు పడిపోయింది సుందరమ్మ. "పట్టుమని పాతికేళ్లయినా లేకుండా ఇదేం ఖర్మ" అని గొణుక్కుంది. రకరకాల తైలాలూ, మర్దనాలూ అయ్యాయి గానీ ప్రయోజనమేమీ లేకపోయింది. కనీసం మిగిలిన నాలుగు పీచులూ ఊడే లోపలే పెళ్లి చేసెయ్యాలని ఉబలాటపడింది.

అప్పుడే పెళ్లేమిటని గోల పెట్టాడు కోటి.ఆ సాయంత్రం కోటి వీధి చివర్నున్న టీకొట్టు దగ్గర నుంచుని దారినపోయే వాళ్లను చూస్తూ తీరిగ్గా టీ చప్పరిస్తున్నాడు. పక్కన టీ తాగుతున్న వాళ్ల లోకాభిరామాయణంతో గోలగోలగా ఉంది. అడ్రసు కనుక్కుందామని స్కూటరు ఆపిన భారీ ఆసామి కోటిని ఏదో ఇంటర్నేషనల్ స్కూలుకి దారడిగేడు. కొత్త మనిషి రాకతో గోల ఆపి అంతా కొత్తాయన వంక చూడసాగేరు జనం. దారి చెప్పాడు కోటి.

"మేష్టారూ, ఆ స్కూలు బాగుంటుందంటారా" ఆరాగా అడిగేడు కొత్తాయన.

"ఏమో నాకెట్టా తెలుస్తుందీ" బిక్కమొహమేశాడు కోటి.

"మరి మీ పిల్లలెక్కడ చదూకుంటున్నారండీ" ఇంకో ప్రశ్న సంధించేడాయన. పక్కనున్న వాళ్లంతా ఘొల్లుమనడంతో బట్టతల తడుముకుంటూ ఇంటికొస్తూనే అద్దంలో చూసుకున్నాడు. నెత్తిమీద బల్బుకాంతి పడ్డంతో నున్నగా మెరుస్తోంది. పోనీ అందమా అంటే అదీ అంతంత మాత్రమే. ఇంకా లేటు చేస్తే మొదటికే మోసమొచ్చే ప్రమాదముందని వెంటనే నిర్ణయించేసుకున్నాడు పెళ్లి చేసేసుకోవాలని.

మనవడు పెళ్లిళ్ల మార్కెట్లో కొత్తగా ఎంటరయ్యాడు గనక బాగానే ధర పలుకుతాడని ఆశించింది సుందరమ్మ. పెళ్లిళ్ల పేరయ్యకి ముందే కట్నకానుకల వివరాలూ, ఇతర కండిషన్లూ అన్నీ చెప్పి ఉంచింది. ఇక్కడే మొదలయ్యింది చిక్కు. సాధారణంగా అమ్మాయి ఫలానా చదూకోనుండాలీ, ఇంత పొడవుండాలీ అని అడుగుతారెవరన్నా. కానీ సుందరమ్మ పెట్టిన కండిషను పెళ్లికూతురికి మోకాళ్లు తాకుతున్నట్టూ బారుజడున్న పిల్ల కావాలంది. కోటికి మాత్రం కొత్త కండిషన్లేమీ లేవుగానీ బామ్మకెదురు చెప్పే ధైర్యం మాత్రం లేదు. ఎంతమంది అమ్మాయిల్ని చూసినా కురచగా భుజాలవరకూ జుట్టు కత్తిరించుకుని పోనీటెయిల్ పేరుతో తోకల్లా జుట్టు కట్టుకు తిరిగే వాళ్లే తప్పించి సుందరమ్మ కోరిక తీరే మార్గం కనిపించట్లేదు. బారుజడ కండీషన్‌తో కొన్ని సంబంధాలు వెనక్కెళ్లిపోయాయి. నిజానికి చూసిన వాళ్లలో చాలామంది కోటికి నచ్చారు గానీ వాళ్లకే కోటి నచ్చలేదు. కొండొకచో ఒకరిద్దరికి నచ్చినా బామ్మ జడ ఫిట్టింగ్‌తో కుదర్లేదు.

"బామ్మా! ఇంతకీ అసలు నాకు పెళ్లి చేస్తావా, చెయ్యవా" ఉరుము లేని పిడుగులా సడన్‌గా అరిచేడు ఇంట్లోకొస్తూనే కోటి ఓ రోజు. కష్టాలూ, కన్నీళ్లు సీరియల్ కళ్లొత్తుకుంటూ చూస్తున్న సుందరమ్మ బిత్తరపోయి చూసింది.

"ఇప్పుడేవయిందిరా" తమాయించుకున్నాక నింపాదిగా అడిగింది.

"ఏమయిందేవిటే? నీ ఛాదస్తంతో ఇప్పటికి 36 పెళ్లిచూపులు తిరగ్గొట్టేవు. అయినా నా పెళ్లానికి జడ లేకుంటే నీకేంటే ఛాదస్తంగాకపోతే. బంకు శీనుగాడు ఏమన్నాడో తెల్సా? మనం గత రెండేళ్లుగా పెళ్లిచూపుల పేరుతో ఊళ్ల మీద పడి తింటున్నామట. ఎంత నామర్దా" ఖిన్నుడయిపోయేడు. జాలిగా చూసింది సుందరమ్మ.

అసలీ జడ క్లాజేమిటో ముందునుండీ అంతుబట్టకుంది కోటికి. ఇదే సరయిన సమయంగా భావించి బతిమాలేడు బామ్మని.


"బామ్మా! ఈ కాలంలో అంత జడతో ఎవరూ దొరకరే. ఇప్పటికే నా అవతారాన్ని ఆడపిల్లలు ఇష్టపడట్లేదు. నువ్వా నీ కోరిక విత్‌డ్రా చేసుకోవే"

"పిచ్చి సన్నాసీ! తొందరెందుకు. వీధిలో వాళ్లేమనుకుంటే మనకేంటి. నా చిన్నప్పుడు పొడుగ్గా జడేసుకుని కుప్పెలు పెట్టుకోవాలంటే నా చిన్న జడతో కుదర్లేదు. కనీసం మీ అమ్మకు వేసి చూసుకుందామంటే మీ అమ్మకీ చిన్న జడేనాయె. ఎప్పుడో 50 ఏళ్ల క్రితం చేయించుకున్న జడకుప్పెలు కనీసం నీ పెళ్లానికన్నా పెట్టుకు చూసుకోవాల్రా నాయనా" డ్రీమ్స్‌లో నుండే ఎక్స్‌ప్లెయిన్ చేసింది బామ్మ.

బోడిగుండుకీ, మోకాలికీ ముడిపెట్టినట్టు బామ్మ కోరికతో తన పెళ్లి ముడిపడ్డం ఏంటో అర్థంకాక వెర్రిమొహమేశాడు కోటి. ఒక వేళ ఏ గజలక్ష్మి లాంటి పిల్లకో బర్రె తోకంత జడుంటే ఏం జేయాలో అర్థంగా లేదు. ఆ వారం పెళ్లిచూపులకి బయల్దేరే ముందు వెయ్యి దేవుళ్లకి మొక్కుకున్నాడు కనీసం ఈ సంబంధమన్నా కుదర్చమని.

పెళ్లిచూపుల్లో కాఫీలవీ అయ్యేవరకూ ముళ్లమీద కూర్చున్నట్టు టెన్షన్ పడిపోయేడు కోటి. పిల్లని తీసుకొచ్చి కూర్చోబెట్టారు. ఎట్టాగూ నిర్ణయం వెనకున్న జడని చూసి గనక పిల్లని వెనక్కి తిప్పి చూపమంటే బావుణ్ణనుకున్నాడు. కోటి ప్రార్థన విన్నట్టుగా పెళ్లికూతురు జడని

ఎ. భారతి



ముందుకేసుకుని కూర్చుంది. ఆ పిల్ల బారుజడ చూడగానే బామ్మ మొహం వెయ్యి ఓల్టుల బల్బులా వెలిగిపోయింది. రోజులు గిర్రున తిరిగి కోటి ఓ ఇంటివాడయిపోయేడు.

ఆ రోజు రాత్రే కోటి శోభనం. గదంతా మల్లెపూలతో అగరొత్తుల పరిమళంతో గుబాళిస్తోంది. ముహూర్తానికింకా టైముందని తెలుగు సీరియల్‌లాగా విషయాన్ని సాగదీస్తున్నాడు పంతులుగారు. పాత, కొత్త తెలుగు సినిమాలన్నీ గుర్తు చేసుకుంటూ ఎలా ప్రొసీడవుతే బాగుంటుందని సతమతమవుతున్నాడు కోటి. ఎట్టకేలకి అమ్మలక్కల పరాచికాల మధ్య గదిలోకొచ్చింది నీలవేణి. పెళ్లికూతురు తెల్లచీరలో సన్నజాజి మొగ్గలా ఉందని మురిసిపోయాడు. 'బామ్మని తిట్టుకున్నాడు గానీ పొడవు జడలో ఉండే అందమే వేరు'

కొత్త సినిమాలో జడపైన పాటని తల్చుకుంటూ వెనగ్గా వెళ్లి సరదాగా జడని ఓ గుంజు గుంజాడు. ఆ ఊపుకి అమ్మాయొచ్చి ఒళ్లో పడలేదు గానీ ముచ్చెనగుంతలో ఊడి జడ కోటి చేతికొచ్చింది. కెవ్వుమని అరవబోయి తవరాయించుకున్నాడు. అటు తిరిగి సిగ్గుపడి గాజులు సవరించుకుంటూ నిల్చున్న పెళ్లికూతురు దిమ్మెరపోయి తిరిగి చూసింది. చేతిలో ఊగుతూ వేళ్లాడుతున్న జడనీ, తన హీరోయిన్నీ మార్చి మార్చి చూసుకున్నాడు కోటి.

ఇప్పుడీ నీలవేణిది బారెడు జడ కాదు సవరమని తెలిస్తే బామ్మ చెయ్యబోయే శివతాండవం గుర్తొచ్చి ముచ్చెమటలు పట్టేశాయి కోటికి. ఏదయితే అయిందని అయిడియా తట్టేవరకూ సవరాన్ని మెయింటైన్ చెయ్యమని బతిమాలేడు నీలవేణిని. పాపం జడ గోలేవిటో తెలీకపోయినా మొగుడ్ని మొదట్లోనే దడిపించడమెందుకన్నట్లు జాలి చూపింది నీలవేణి.

అందరూ తన వంక అదోలా చూస్తుంటే తల కొట్టేసినట్టుంది కోటికి. అలాగని ఇప్పుడీ జడ సంగతి బామ్మకి చెప్పేస్తే అవక అవక అయిన పెళ్లి కాసింతా పెటాకులవుతుందేమోనని భయం పట్టుకుంది. కానీ బామ్మకి చెప్పకుండా దాయటమెట్లా!

"ఒరే కోటీ! కొంచెం ఇటొస్తావ్రా" గదిలోంచి అరిచింది బామ్మ మూత ఊడిరాని ట్రంకుపెట్టెతో అవస్థలు పడుతూ. మూత తీసివ్వబోతూ అడిగేడు "ఏం కావాలి బామ్మా ఇందులో."

"ఇందులో నా జడకుప్పెలూ, సూర్యవంకా, చంద్రవంకా ఉన్నాయిరా. అమ్మాయి స్నానం చేశాక స్వయంగా తల దువ్వి నేనే పెడ్తా" బాంబు పేల్చింది బామ్మ చిద్విలాసంగా.

విషయం తెలిస్తే ఇక తన పని గోవిందా అనుకున్న కోటి మనసులో ఫ్లాష్‌లా అయిడియా తట్టింది. తన సమయస్ఫూర్తికి లోలోన మురిసిపోయాడు. పెళ్లవ్వగానే కొండకొస్తానని మొక్కుకున్నానని వెంటనే నీలవేణిని బయల్దేరదీశాడు. బామ్మ ప్లాను పోస్టుపోన్ చేసుకోక తప్పలేదు.

మూడోరోజు ఇంటి ముందు ఆటో ఆగిన చప్పుడికి ఉత్సాహంగా ఎర్రనీళ్లు దిష్టి తీసేందుకు ఎదురొచ్చింది బామ్మ. అవతారాలు మారిపోయి ప్రత్యక్షమైన మనవడ్నీ, పెళ్లికూతుర్నీ చూసి నోరెళ్ల బెట్టింది. పెళ్లికొడుకు గుండుతో ప్రత్యక్షమయ్యాడు. మామూలుగా అయినా ఎలాగూ అటు చెవిమీద, ఇటు చెవిమీద తప్పించి నడినెత్తిన జుట్టు లేని కోటి గుండులో కూడా పెద్దగా తేడాగా ఏం లేదు. ఎటొచ్చీ కొత్త కోడలు అట్లా బారుజడ కత్తిరించేసి, భుజాల వరకూ క్రాపుతో రావడమే భరింపరానిదిగా ఉంది బామ్మకు. అయినా తన ఆరోగ్యం గురించి దేవుడ్ని కోరుకుంటూ కొత్త దంపతుల త్యాగాన్ని కన్నీళ్లొత్తుకుంటూ తల్చుకుని ఆనందపడింది బామ్మ.

బామ్మ జడకుప్పెల కోరిక గోవిందా...గోవింద. ❀